క్లుప్తంగా

కళాకారుడు శివశంకరరావుకు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో మంగళవారం ఎర్రకోటవీరుడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. బుధవారం నిండుసంసారం చిత్రాన్ని ప్రదర్శిం చనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పౌరాణిక, సాంఘిక నాటక కళాకారుడు కాజా శివశంకరరావును ఘనంగా సన్మానించారు. తాడిబోయిన హరిప్రసాద్, షేక్ మస్తాన్ బాషా, షేక్ అల్తాఫ్, ఆరాధ్యుల ఆదినారాయణ, కుమార్ బాబు, షేక్ ఖాదర్ బాషా, తాడిబోయిన శివనాగేశ్వరరావు, పెమ్మసానీ పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా ఆశ్రమంలో సత్యసాయి భజనలు



తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా సేవాశాంతి ఆశ్రమంలో మంగళవారం భగవాన్ సత్యసాయిబాబా గాన సంకీర్తనలు, భజనలు జరిపారు. సాయిబాబా చిత్రపటం వద్ద నివాళులర్పించారు. డాక్టర్ నోరి నారాయణమూర్తి, సత్యసాయిబాబా గురించి వృద్ధులకు ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేశారు. ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, రాఘవయ్యశాస్త్రి, వై.కోటేశ్వరరావు, ఆశ్రమవాసులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్



తెనాలిరూరల్: జూదరులను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) అధికారులు అరెస్ట్ చేశారు. తెనాలి మండలం కొలకలూరు పరిధిలోని పొలాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్‌ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. తొమ్మిది మంది పేకాట ఆడుతుండగా అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 32,900, తొమ్మిది సెల్‌ఫోన్‌లు స్వాధీనపర్చుకున్నారు. నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తును రూరల్ పోలీసులకు అప్పగించారు. బుధవారం కోర్టులో హాజరుపరచనున్నట్టు తెలిపారు.

న్యాయమూర్తులకు సత్కారం

తెనాలిరూరల్: బదిలీ అయిన తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి టి.రామచంద్రుడు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ షరీఫ్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా అభినందన సభను తెనాలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. బదిలీ అయిన న్యాయమూర్తులను సోమవారం సత్కరించారు. ముఖ్య అతిథిగా 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.మాలతి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీసీత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణు గోపాలరావు, హరిదాసు గౌరీశంకర్, కంచర్ల రాజశేఖర్, గద్దిపాటి రాంబాబు, వెలినేని రాఘవయ్య, ఎంఎన్ జగదీశ్వరాంబ, ఏపీపీ ఎలిజబెత్‌రాణి, ఇతర న్యాయవాదులు, న్యాయవాద గుమాస్తాలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహించవద్దు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహించడానికి వీలులేదని మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ, రూరల్ పరిధిలో అనుమతులు లేకుండా ప్రైవేటు పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు ఎవరైనా నిర్వహిస్తుంటే వెంటనే గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోవాలని, గుర్తింపు పూర్తయిన పాఠశాలలు వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

రేపు వివిధ హక్కుల వేలం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామంలోని మహంకాళి అమ్మవారి దేవస్థానానికి సంబంధించి జరిగే వేలంలో వ్యాపారులు పాల్గొని దేవస్థానం అభివృద్ధికి తోడ్పడాలని కార్యనిర్వహణాధికారి వి.సిహెచ్ వెంకటరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 27వ తేదీ దేవస్థానానికి సంబంధించిన కొబ్బరి చెక్కల సేకరణ, గ్యాస్ పొయ్యిల నిర్వహణ, వాహనాల పార్కింగ్ రుసుముల వసూలు, వంటసామగ్రి, షామియానాలు అద్దెకిచ్చు హక్కు, చీరలు, జాకెట్ ముక్కలు సేకరణ, వివిధ లైసెన్స్ హక్కులు ఓ ఏడాదికి, చిన్న పెద్ద తీర్థం ఒక సంవత్సర కాలానికి లైసెన్సు హక్కులు పొందుటకు వేలం నిర్వహిస్తున్నారని, ఆసక్తిగల వారు బహిరంగ వేలంలో పాల్గొనాలని సూచించారు.

విష జ్వరాలపై అవగాహన అవసరం

- చైర్ పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్
- తెనాలిలో మలేరియా అవగాహన ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్

తెనాలిరూరల్: విష జ్వరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, మలేరియా నిర్మూలన బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ చైర్ పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా తెనాలి పురపాలక సంఘం, పట్టణ మలేరియా, ఫైలేరియా యూనిట్ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి చేపట్టిన ర్యాలీని ఖలేదా నసీమ్ ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, ఎంహెచ్‌ఓ డాక్టర్ హెలెన్ నిర్మల తదితరులు ఆయా విభాగాల సిబ్బందితో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దోమకాటు వల్ల ఒకరి నుంచి మరొకరికి ఈ మలేరియా వ్యాధి వ్యాప్తి చెందుతుందని, దోమలు నీటిలో గుడ్లు పెడతాయని, ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూడటం వలన మలేరియా వ్యాప్తిని అరికట్టవచ్చునని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని, వ్యర్థాలను కాలువలలో వేయడం వల్ల నీటి పారుదల ఆగి, అవి దోమల పెరుగుదలకు ఆవాసాలుగా తయారవుతాయని అన్నారు. ఇంటిలోని నీటి నిల్వలను వారానికి రెండు సార్లు మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ గొడవర్తి సాయి హరే రామ్, శానిటరి ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, అసిస్టెంట్ మలేరియా అధికారి వి.పున్నారెడ్డి, పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.ఉమాకాంత్, ఫైలేరియా సబ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనరసయ్య, జూనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీనివాసరావు, హెల్త్ సెక్రటరీలు, ఆర్పీలు, నగర దీపికలు పాల్గొని గాంధీ చౌక్ సెంటర్లో మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేశారు.



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ సుబ్బారావు, ఆరోగ్య సిబ్బంది



మలేరియా నిర్మూలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ లక్ష్మిసుధ

కొలకలూరులో...

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని జరిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుబ్బారావు పర్యవేక్షణలో ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యాప్తి, నివారణ తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి డాక్టర్ సుబ్బారావు వివరించారు. దోమకాటు ప్రమాదకరం, దానివల్ల మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు, బోధకాలు వంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి, దోమల నివారణ దోమ తెరలు వాడాలని ర్యాలీలో నినాదాలు చేశారు. డాక్టర్ దిలీప్, హెచ్‌ఈఓ నాగ రాజు, సూపర్‌వైజర్‌లు జి.శ్రీనివాసరావు, కె.లక్ష్మీ ప్రసన్న, ఎంవీ సుధారాణి, డి.కిరణ్‌కుమారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లిపరలో...

కొల్లిపర: దోమల నిర్మూలన ద్వారా మలేరియా వ్యాధికి చెక్ పెట్టవచ్చని మండల వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ లక్ష్మీసుధ, డాక్టర్ వి.ప్రియాంక అన్నారు. మంగళవారం మండలంలో మున్నంగి, వల్లభాపురం, అత్తోట, కొల్లిపర, తూములూరు వివిధ గ్రామాలల్లో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఆయా గ్రామాలల్లో ర్యాలీ నిర్వహించి, దోమల నిర్మూలకు తీసుకోవాల్సి జాగ్రత్తలు, మలేరియా వ్యాధి గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇల్లు, గేదలు పాక, ఖాళీస్థలాల మధ్య ఉన్న మురుగు నీటిని గుర్తించి వాటిలో ఉన్న దోమల ఆవాసాలను గుర్తించి, నిర్మూలించాలన్నారు. దోమకాటు తప్పించుకోవాలంటే ప్రతి ఒక్కరు దోమ తెరలు వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి, వంగర బుజ్జిబాబు, పీహెచ్‌ఎన్ కోటేశ్వరి, సూపర్‌వైజర్ బీవీ సాయిబాబు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లు



మున్నంగి(కొల్లిపర): క్షయ వ్యాధి గ్రస్తులు నిత్యం వైద్యుల సలహాలు, మందులు వాడుకుంటూ ప్రతి రోజు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మండల వైద్యాధికారి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ, డాక్టర్ వేముల ప్రియాంక సూచించారు. మంగళవారం మండలంలో మున్నంగి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షయవ్యాధిగ్రస్తులకు రెండవ విడత పౌష్టికాహార సరకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు క్షయ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మందులు ఏవిధంగా వాడాలి అన్న అంశాలను వివరించారు. పౌష్టికాహార కిట్లులను పంపిణీ చేశారు. వీటితో పాటు స్థానిక ఎస్‌బీఐ బ్రాంచి సౌజన్యంతో 13మంది రోగులకు పోషకాహార ప్యాకెట్స్ అందజేశారు. టీబీ సూపర్‌వైజర్ పల్లెకొండ రవికుమార్, ఆరోగ్య విస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి, పి.హెచ్.ఎన్ కోటేశ్వరి, పఠాన్ ఉందాద్ ఆలీఖాన్, షేక్ మస్తాన్, బి.శ్రావణి పాల్గొన్నారు.

వైభవంగా తిరునక్షత్ర మహోత్సవం



తిరునక్షత్ర మహోత్సవం

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీశరణాగతి గోష్టి ఆధ్వర్యంలో నరేంద్ర రామానుజ దాసస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఇక్కడ జరుగుతున్న శ్రీభగవత్ రామానుజాచార్యులు వారి 1006వ తిరు నక్షత్ర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో భగవత్ శ్రీరామానుజ తిరునక్షత్ర మహోత్సవాన్ని వైభవంగా జరిపారు. ఉదయం 10–12 గంటలకు సీతారామస్వామి కల్యాణ మహోత్సవం కమనీయంగా నిర్వహించారు. మధ్యాహ్నం 1.30–3 గంటలకు శ్రీశారదా నృత్యకళాపీఠం, విజయవాడ వారిచే అన్నమయ్య కృష్ణతత్వం నృత్యరూపకం ప్రేక్షక భక్తులను అలరించింది. అనంతరం భాగవతులచే భగవద్రామానుజ వైభవం ప్రవచనాలు భక్తులకు ఆధ్యాతిక అనుభూతిని పంచాయి. సాయంత్రం శ్రీలక్ష్మీ శారద సంగీతాలయం శిష్యబృందంచే సంగీత విభావరి గౌరావఝుల ఆంజనేయశాస్త్రి నిర్వహణలో సాగింది. సాయంత్రం ఆరు గంటలు తదుపరి నాలుగు గుర్రాలతో కూడిన రథంపై శ్రీభగవద్రామానుజల శోభాయాత్ర పురవీధుల్లో ఆకర్షణీయంగా నిర్వహించారు. పంచాంగం రామానుజాచార్యుల స్వామి (రామానుజగోష్టి), ఎస్‌టీజీ మురళీధర మిశ్రా, రావూరి వెంకట సాయివరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేరెంట్స్ కమిటీలతో సామాజిక తనిఖీలు



ఈ-సర్వే యాప్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొల్లిపర: ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహకారంతో చేపడుతున్న నాడు-నేడు పాఠశాలల అభివృద్ధి కార్యక్రమాల్లో పాఠశాలలో సామాజిక తనిఖీలను ఇక నుంచి పేరెంట్స్ కమిటీల ద్వారా నిర్వహిస్తున్నట్లు జిల్లా రిసోర్స్ పర్సన్ ఎం.ఏడుకొండలు, ఉన్నం ప్రసాద్ అన్నారు. మంగళవారం రాష్ట్ర శిక్ష కో–ఆర్డినేటర్ అమరావతి ఎస్‌పీడీ ఆదేశాల మేరకు సపోర్టింగ్ ఆఫ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఎస్‌ఏఎల్‌టీ కార్యక్రమంలో భాగంగా సామాజిక తనిఖీ తల్లిదండ్రుల ద్వారా నిర్వహించవలసిన ముఖ్య అంశాలపై ప్రధానోపాధ్యాయులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయులు 29వ తేదీలోపు పేరెంట్స్ కమిటీ సభ్యులకు అవగాహన కల్పించి, ఈ-సర్వే యాప్ ద్వారా సర్వే పూర్తి చేయాలని సూచించారు. ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ ఎస్.రమేష్, ప్రధానోపాధ్యాయులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

గంజాయి బస్తాల మాయంపై సీరియస్

- రికార్డులు, నిల్వలను పరిశీలించిన ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్
- విచారణాధికారిగా ఏఎస్పీ నియామకం




మాట్లాడుతున్న ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్

మంగళగిరి: మంగళగిరి రూరల్ స్టేషన్ నుంచి గంజాయి బస్తాల మాయంపై ఉన్నతాధికారులు సీరియస్ కావడంతో జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ మంగళవారం మంగళగిరి రూరల్ స్టేషన్‌కు చేరుకుని విచారణ చేపట్టారు. గంజాయి కేసులకు సంబంధించిన రికార్డులు, గంజాయి నిల్వలను పరిశీలించారు. అనంతరం పట్టణ స్టేషన్‌కు చేరుకుని పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ గంజాయి బస్తాల మాయంపై విచారణకు ఏఎస్పీ అనిల్‌కుమార్‌ను నియమించినట్లు తెలిపారు. గంజాయి బస్తాల మాయం వ్యవహారంలో అధికారులు, సిబ్బంది పాత్రపై వచ్చిన ఫిర్యాదులను విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ పి అనిల్‌కుమార్, నార్త్‌జోన్ డీఎస్పీ జె రాంబాబు, పట్టణ, రూరల్ ఎస్‌ఐలు బి అంకమ్మరావు, వి భూషణం, ఎస్‌ఐలు మహేంద్ర, రమేష్ బాబు సిబ్బంది పాల్గొన్నారు.

మలుపులు తిరుగుతున్న బస్తాల మాయం

స్టేషన్‌లో ఎన్ని బస్తాల గంజాయి మాయమైందనే దానిపై అధికారులకు స్పష్టత లేదని తెలుస్తుంది. శనివారం రాత్రి ఒక బస్తా గంజాయి మాయమైనట్లు పోలీసులు చెబుతున్నా వాస్తవానికి మూడు బస్తాల గంజాయి మాయం కాగా పారిపోయిన నిందితులు రెండు బస్తాల గంజాయిని పాత రైల్వేగేటు అవతల తగులబెట్టినట్లు తెలిసింది. గంజాయి తగలబడుతుండగా వాసన గమనించిన స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం అందించగా సిబ్బంది చేరుకుని పరిశీలించారు. గంజాయి బస్తాలు తగులబడుతున్న సమయంలో సిబ్బందికి, స్టేషన్‌కు సంబంధించిన బీటు పుస్తకం సైతం ఘటనా స్థలంలో లభించినట్లు సమాచారం. గంజాయి బస్తాల మాయం వెనుక పట్టణ స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. శనివారం రాత్రి రక్షక్ వాహనంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మూడు గంటలకు పట్టణ స్టేషన్‌కు చేరుకుని వాహనం అక్కడ ఉంచి రూరల్ స్టేషన్ ఆవరణలోని గంజాయి నిల్వల వద్దకు వెళ్లి సుమారు గంటపాటు ఉన్నట్లు సీసీ టీవీ పుటేజిలో అధికారులు గుర్తించినట్లు తెలిసింది. కానిస్టేబుల్ గంజాయి నిల్వల వద్ద ఉన్న సమయంలోనే గంజాయి బస్తాలు బయట గోడ వెనుకకు పడటం పలు అనుమానాలకు తావిస్తుంది. అధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది సహకారంతోనే గంజాయి బస్తాలు తరచూ మాయమవుతున్నట్లు పోలీసు వర్గాలే పేర్కొనడం గమనార్హం.

వైఖాన సాగమ పండితుడు హనుమంతాచార్యులు మృతి



తెనాలిటౌన్: ప్రముఖ వైఖాన సాగమ పండితుడు, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా 1986లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చేతుల మీదుగా ఉగాది పురస్కార అవార్డు అందుకున్న రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన శ్రీమాన్ దీవి హనుమంతాచార్యులు (96) సోమవారం అర్ధరాత్రి స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు, ముదిమనుమలు, ముదిమనుమరాండ్రు ఉన్నారు. తిరుమల వేద పాఠశాల ప్రారంభంలో తొలి విద్యార్థిగా చేరిన ఆచార్యులు ప్రముఖ పండితులు రొంపిచర్ల పార్థసారథి భట్టాచార్యులు వద్ద ఆగమశాస్త్ర విద్యను అభ్యసించారు. 1975లో కొలకలూరులో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం చేశారు. హనుమంతాచార్యులు మృతివార్త తెలుసుకున్న మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. రాష్ట్ర అర్చక సమాఖ్య ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.అనంతాచార్యులు, జిల్లా సమాఖ్య కో–ఆర్డినేటర్ టి.రఘు, ప్రధాన కార్యదర్శి టి.హరిబాబు, కృష్ణా జిల్లా కో–ఆర్డినేటర్ దీవి సారంగపాణి, బాపట్ల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శ్రీనివాసమూర్తి, వైఖానస సేవా సంఘం గౌరవాధ్యక్షుడు డీఎల్‌ఎన్ ఆచార్యులు, ఉపాధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, పలు ధార్మిక సంఘాల నాయకులు, గ్రామంలోని ప్రముఖులు హనుమంతాచార్యులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

చలివేంద్రం ప్రారంభం



తెనాలిటౌన్: బోసురోడ్డులోని చిట్టి ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి, బాటసారులు, ప్రజలకు ఉపయోగపడే విధంగా చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్య సంఘాల కో–ఆర్డినేటర్ మద్దాలి శేషాచలం, పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు, తూనుగుంట్ల సుబ్బారావు, సీవీ రమణ, రఘునాథగుప్తా, చుండూరు సాయి, పాటిబండ్ల శ్రీనివాసరావు, షేక్ మీరావలి, కుర్రా శ్రీనివాస్, మునిపల్లి వంశీ, గుప్తా, కొమ్మూరి నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 151 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్యే శివకుమార్, రామ్‌చంద్

తెనాలి: దక్షిణాది రాష్ట్రాల్లో బిజినెస్ టు బిజినెస్ కార్యక్రమాలను నిర్వహిస్తున్న రాధారామ్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ఫైనలియర్ విద్యార్థులు 151 మందికి ఉద్యోగాలు లభించాయి. బీకాం, బీఎస్సీ, బీసీఏ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థుల్లో కంప్యూటర్ సైన్స్‌లో పూర్తి పరిజ్ఞానం, ఇంగ్లిష్‌లో భావప్రకటన సామర్థ్యం ప్రాతిపదికన కంపెనీ వీరిని ఎంపిక చేసుకుందని ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వీరికి నెలకు రూ.19,250 వేతనం ఇస్తారని చెప్పారు. మార్కెట్ సరళిని పరిశీలిస్తూ, వివిధ డిజిటల్ ప్లాట్‌ఫాంస్‌తో ఒప్పందాలను కుదుర్చుకుంటున్నట్టు తెలిపారు. సిలబస్‌తోపాటు జీవన కళలు, తగిన నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తున్నందునే కాలేజీలో ఒక్కో విద్యార్థికి ఒకటినుంచి రెండు, మూడు ఉద్యోగాలకు లభిస్తున్నాయని చెప్పారు. నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు మారుపేరుగా నడుస్తున్న ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి, గత అయిదారేళ్లుగా క్యాంపస్ ఉద్యోగాల్లో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. విద్యార్థుల సంఖ్యాపరంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలోనే నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. అన్నిటికీ మించి వేలాదిమంది విద్యార్థులకు డిగ్రీతోనే ఉద్యోగాలు కల్పిస్తున్నామన్న సంతృప్తి తమకు ఉందన్నారు. వీరితో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ ఉన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిత



చిన్నారులకు ప్రమోషన్ సర్టిఫికెట్లను అందజేస్తున్న రావిపాటి వీరనారాయణ

కొల్లిపర: విద్యార్థులు చిన్న వయసు నుంచి అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని, కష్టపడి చదవాలని వివేక విద్యాసంస్థల డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ, అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాల కోశాధికారి బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వివేక హైస్కూల్‌లో ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థుల ప్రమోషన్ డే వేడుకలను విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను చిన్నవయస్సు నుంచి గమనిస్తూ వారికి సన్నిహితంగా ఉండి, మంచి మార్గంలో నడిపించాలన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కె.రామరాజు, పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న, అడ్మిన్ అక్షయ్, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆర్థిక సాయం



పొన్నెకల్లు(తాడికొండ): తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న షేక్ బాజీ కుటుంబానికి ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆర్థిక సాయం అందజేశారు. రెండు నెలల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాజీ చికిత్స పొందుతున్నారు. మండలంలోని ఉపాధ్యాయులతోపాటు యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో రూ.2,08,250 నగదును అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు ఆదిలక్ష్మి, ప్రధానకార్యదర్శి కళాధర్, కార్యదర్శి షకీలా బేగం, ఆదినారాయణ పాల్గొన్నారు.

కేఎల్‌యూలో మహిళా ఐడియాథాన్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయంలో కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం స్టార్టప్ ఫౌండేషన్ కమ్యూనిటీ మహిళా సెంట్రిక్ ఐడియాథాన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఏసీఐసీ సీఈఓ అలోక్ గోవిల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అటల్ ఇన్నోవేషన్ మిషన్ నీతి అయోగ్, భారత ప్రభుత్వం మద్దతులో కేఎల్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ఏసీఐసీ కేఎల్ స్టార్టప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ సెంట్రిక్ రెండో దశ మహిళా సెంట్రిక్ ఐడియా థాన్‌ను నిర్వహించామని, ఈ కార్యక్రమంలో ఇంక్యుబేషన్ సెంటర్లు అంటే ఏమిటి, వాటి ప్రాముఖ్యతలు ఎలా ఉంటాయనే విషయాలను వివరించామని,

వెనుకబడిన ప్రాంతాలకు చెందిన మహిళా ఆవిష్కర్తలకు నూతన ఆవిష్కరణల గురించి అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని పరిశోధన, వ్యాపార నిపుణుడు రమణకాంత్, పరిశోధన, బిజినెస్ నిపుణులు రోహన్ అండే, డిజైన్ నిపుణులు శివప్రసాద్, వ్యాపార పరిశోధనా నిపుణురాలు శ్రుతి భార్గవ, మాటేటి అశ్విన్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగి భార్య ఆత్మహత్యాయత్నం

తాడేపల్లిరూరల్: ఆర్మీలో ఉద్యోగం చేస్తున్న తన భర్త తనను పట్టించుకోవడం లేదని మనస్తాపం చెందిన తన మూడు నెలల చిన్నారితో కలసి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. పోలీసులు ఆమె ప్రయత్నాన్ని అడ్డుకుని తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు..తిరుపతికి చెందిన నాగరాజు, ఉషారాణిల కుమారుడు వేణుగోపాలనాయుడు ఆర్మీలో పనిచేస్తున్నాడు. విశాఖపట్నంకు చెందిన భానును 2019లో వివాహం చేసుకున్నాడు. వీరిద్దరికి మూడు నెలల చిన్నారి ఉంది. పాప పుట్టిన దగ్గర నుంచి పట్టించుకోకపోవడం, మాట్లాడకపోవడంతో భాను పాపను తీసుకుని హిమాచల్‌ప్రదేశ్ వెళ్లింది. అక్కడ కూడా భార్యతో మాట్లాడకుండా ఇబ్బంది పెట్టాడు. అనంతరం తిరిగి మరల విశాఖపట్నంలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చిన భాను దగ్గరకు 20 రోజుల క్రితం వేణుగోపాల్ వచ్చి తిరిగి మరల తిరుపతి వెళ్లి ఆమెతో మాట్లాడకపోవడంతో మనస్తాపం చెందిన భాను ఆదివారం వైజాగ్‌లోని పుట్టింటి నుంచి బయటకు వచ్చి మంగళవారం ఉదయం విజయవాడ వచ్చి ప్రకాశంబ్యారేజ్‌పై అనుమానాస్పదంగా తిరిగింది. ఆమె ప్రవర్తనపై అనుమానం వచ్చిన ప్రకాశం బ్యారేజ్ ఔట్ పోస్ట్ సిబ్బంది ప్రశ్నించారు. జరిగిన విషయాన్ని పోలీసులకు తెలుపడంతో విశాఖలో ఉన్న భాను తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ప్రస్తుతం భానును, చిన్నారిని మేరీ హోమ్స్‌లో ఉంచినట్లు పోలీసులు తెలిపారు.

క్రీడాకారులకు అభినందనలు

తాడేపల్లిరూరల్ : ఈనెల 22, 23 తేదీల్లో జరిగిన 9వ ఏపీ ఇంటర్ సీనియర్ జిల్లా స్థాయి వుషు చాంపియన్ షిప్ పోటీల్లో వివిధ పతకాలు సాధించిన విద్యార్థులను మంగళవారం యాజమాన్యం అభినందించింది. విద్యార్థి సంక్షేమ విభాగ అధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు మాట్లాడుతూ సివిల్ ఇంజినీరింగ్‌లో ద్వితీయ సంవత్సరం చదువుతున్న గుంటూరుకు చెందిన ఎం.గోపిచంద్, ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న డి.ఆదిత్య, ట్రిపుల్ ఈఈ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎం.బ్రహ్మేంద్రలు జిల్లాస్థాయిలో రజత పతకాలు సాధించారని అన్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధివర్మ, ప్రొ వీసీ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డీన్ సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్, డాక్టర్ కె.సుజాత, వ్యాయామ అధ్యాపకులు అభినందించారు.